Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143




Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 175 | Friday : 20.06.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :175 | శుక్రవారం 20 జూన్ 2025 | వెల : 3 | పేజీలు : 4

# కలహాల కమలం?



- ముందుకు సాగని కార్యాచరణ
- అధికార పీఠాన్ని దక్కించుకోవడమే టార్గెట్‌గా అడుగులు వేస్తున్న కమలదళం వ్యూహాలు అంతగా వర్కౌట్ అవ్వడం లేదా?
- కొత్త కొత్త కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లాలన్న ఆలోచనలు..
- కార్యరూపం దాల్చడంలో ఎదురు దెబ్బలు తగులుతున్నాయా?
- అందుకే ఇప్పుడు కాషాయ నేతలు సరికొత్త స్ట్రాటజీతో ప్రజల ముందుకు వస్తున్నారా?

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

తెలంగాణలో అధికార పీఠాన్ని దక్కించుకోవడమే టార్గెట్‌గా అడుగులు వేస్తున్న కమలదళం వ్యూహాలు అంతగా వర్కౌట్ అవ్వడం లేదా? కొత్త కొత్త కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లాలన్న ఆలోచనలు.. కార్యరూపం దాల్చడంలో ఎదురు దెబ్బలు తగులుతున్నాయా? అందుకే ఇప్పుడు కాషాయ నేతలు సరికొత్త స్ట్రాటజీతో ప్రజల ముందుకు వస్తున్నారా? అసలు తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతుందో చూద్దాం. ప్రతి రోజు ప్రజలకు అందుబాటులో ఒక ప్రజా ప్రతినిధి. పులిని చూసి ఇంకేదో వాత పెట్టుకున్నట్టు ఉంది ప్రస్తుత బీజేపీ వ్యవహారం.. బీజేపీ భరోసా పేరుతో ప్రజలకు అండగా నిలవాలని.. ప్రజల నుంచి వారి సమస్యలపై ఫిర్యాదులు తీసుకోవడం మొదలుపెట్టింది. రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ప్రతి రోజు ఒక ప్రజా ప్రతినిధి ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ప్రజల నుంచి ఫిర్యాదులు సేకరించడం ప్రారంభించారు. దీనికి తగ్గట్టుగానే ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ఉదయనీ 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పార్టీ కార్యాలయంలో - మిగతా3లో



## 15 రోజుల్లోగా ఓటర్ ఐడీ కార్డుల డెలివరీ

- కార్డు(ఎపిక్)ను ఓటర్లకు చేరవేసే విషయంలో ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- ప్రస్తుతం ఈ కార్డుల డెలివరీకి నెల రోజులకుపైగా సమయం
- నూతన ప్రామాణిక నియమావళిని ఎన్నికల సంఘం రూపొందించింది.

# జగన్ హయాంలో ఎన్నో అరాచకాలు

- ప్రజలను ఇబ్బంది పెడతారా..
- గంజాయి, బెట్టింగ్ బ్యాచ్‌లు, రౌడీలకు విగ్రహాలు పెడతారా: సీఎం చంద్రబాబు
- తాము ఎవరినీ టార్గెట్ చేయడం లేదు..
- చట్టం తన పని తాను చేసుకుపోతుందని
- ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం
- కొందరికి క్రైమ్ కూడా అలవాటు అయిపోయింది



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సత్తెనపల్లి పర్యటన సందర్భంగా అల్లర్లు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. గురువారం ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఓ వైపు యోగా జరుగుతుంటే.. మరోవైపు వైసీపీ శ్రేణులు రప్పా రప్పా అంటున్నారని మండిపడ్డారు. చంపండి.. నరకండి.. అని ఎవరైనా అంటారా అని ప్రశ్నించారు. గంజాయి, బెట్టింగ్ బ్యాచ్‌లు, రౌడీలకు విగ్రహాలు పెడతారా అని నిలదీశారు సీఎం చంద్రబాబు. ఇరుకు వీధుల్లో మీటింగ్‌లు పెట్టి ప్రజలను ఇబ్బంది పెడతారా అని సీఎం చంద్రబాబు అడిగారు. హింసను ప్రోత్సహించి పోలీసులపై నిందలు మోపుతారా అని ఫైర్ అయ్యారు. ఏపీలో ఎప్పుడైనా ఇలాంటి పోకడలు చూశారా అని ప్రశ్నించారు. నేరస్థులతో రాజకీయాలు - మిగతా3లో



## నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డికి బాధ్యతలేదు

- తెలంగాణకు ద్రోహం చేస్తోన్న రేవంత్‌రెడ్డిని ఏం చేసినా తప్పు లేదు
- తెలంగాణకు నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డిది బాధ్యతారాహిత్యమే
- రేవంత్‌రెడ్డి లెక్క తాము అడ్డదారిలో రాలేదు.. ఉద్యమం నుంచి వచ్చిన వాళ్లం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సంచలన వ్యాఖ్యలు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు ద్రోహం చేస్తోన్న రేవంత్‌రెడ్డిని ఏం చేసినా తప్పు లేదని అన్నారు. తెలంగాణకు నీళ్ల - మిగతా3లో



## ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి

- కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు
- అటువంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవు
- మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలు
- మన భాషలే లేకుంటే మనం నిజమైన భారతీయులుగా ఉండలేం.

## దొంగలు ఎక్కడైనా దొంగతనం చేశామని ఒప్పుకొంటారా?



- వైవీ సుబ్బారెడ్డి వద్ద ట్యాప్ అయిన తన ఆడియో ఉంది
- ఇది నిజమో కాదో.. వైవీ సుబ్బారెడ్డి అతని కుటుంబసభ్యుల మీదు ప్రమాణం చేసి నిజం చెప్పాలి
- ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.
- "కేసీఆర్, జగన్ ఆనాడు నీచ రాజకీయాలు చేశారు. అందులో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ చేశారు.



## ఐటీ ఉద్యోగుల నెత్తిన మరో పిడుగు?!

- త్వరలో ఐటీ రంగంలో పనిగంటలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది
- ఆ దిశగా సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా బెంగళూరులో తొలి అడుగు
- ఐటీ సెక్టార్‌లో పని గంటలను పెంచే యోచనలో కర్ణాటక ప్రభుత్వం?

## సాగు యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా

- ఐదు ఎకరాల వరకు ఉన్న 4.43లక్షల వేల మందికి రైతుభరోసా నిధులు జమ
- రాష్ట్రవ్యాప్తంగా 19.82 లక్షల ఎకరాలకు రూ.1,189.43 కోట్లు జమ
- ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు రైతు భరోసా సాయం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

అన్నదాతల ఖాతాల్లో రైతుభరోసా నిధుల జమ కొనసాగుతోంది. ఇవాళ ఐదు ఎకరాల వరకు ఉన్న 4.43లక్షల వేల మందికి రైతుభరోసా నిధులు జమ చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 19.82 లక్షల ఎకరాలకు రూ. 1,189.43 కోట్లు ఇవాళ జమ చేసినట్లు చెప్పారు. తొమ్మిది రోజుల్లో అర్హులైన రైతులందరికీ రైతుభరోసా వేసే లక్ష్యంతో నిధులు విడుదల చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకు 62 లక్షల 47వేల మంది రైతులకు ఒక కోటి 6 లక్షల ఎకరాలకు - మిగతా3లో



## అమెరికా వీసా ఓ 'ప్రివిలేజీ' మాత్రమే.. 'హక్కు' కాదు

- ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే ఆ వీసాను రద్దు చేసే అవకాశం
- భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది.
- స్టూడెంట్ లేదా పర్యటక వీసాపై వెళ్లేవారు మాదకద్రవ్యాలు తీసుకోవడం లేదా అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తే భవిష్యత్తులో అమెరికా వీసాకు అనర్హులవుతారు

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 ప్రాంతీయ తెలుగు దినపత్రిక



# కౌలు రైతు కష్టాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టదా



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19:** దేశానికి వెన్నుముక, అన్నదాత అని గొప్పలు చెప్పుకునే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కౌలు రైతుకష్టాలు పట్టవాఅంటూజాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డి.వి.మునిరత్నం ఘాటుగా పేర్కొన్నారు.అందులో భాగంగా గురువారం పలమనేర్ పట్టణంలో మానవ హక్కుల కార్యాలయంలో పార్థసారథి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు డివి మునిరత్నం, మణి, సూర శ్రీనివాసులు, గుర్రం సుబ్రహ్మణ్యం, అనసూయ మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్నలను ఆదుకోవడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఆంధ్రరాష్ట్రంలో నిత్యంఎప్పుడో ఒకచోట రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటూనేఉన్నారని, వెన్నుముక లాంటి వారు కనుమరుగైతే దేశానికి కావలసిన ఆహారధాన్యాలను పండించే వారు ఎవరని నిలదీశారు. కార్పొరేట్ శక్తులు ప్రజాధనాన్ని కోట్లాది రూపాయలు కొల్లగొట్టి విదేశాలకు పారిపోయే వారికి ప్రోత్సాహం కల్పించే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నంపెట్టే రైత న్నలను ఎందుకు ఆదుకోలేదోసమాధానం చెప్పాలన్నారు. రైతు నాయకులు రమణా రెడ్డి, నరసింహులు, సర్దార్ మాట్లాడుతూ దేశంలో సగానికి పైగా జనంవ్యవసాయాన్ని నమ్ముకొని రెక్కల కష్టముతో పంటల పండిస్తున్న కౌలు రైతులకు పెట్టుబడికి సాయం మందకా, ఎరువులు విత్తనాలు నాణ్యత లేక పండించిన పంటకు గిట్టు బాటు ధర లేక కౌలు రైతు కష్టాలు రోజు రోజుకు మితిమీరి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వడ్డీలకు అప్పు చేసి పంట పండిస్తే గిట్టుబాటు ధర లేక దళారు చేతుల్లో పెట్టి కన్నీటితో రైతన్నలు వెనుతిరుగుతున్నారని గుర్తు చేశారు.ప్రతి పంటలో నష్టాలు చవి చూస్తున్న కౌలు రైతులు మనోధైర్యం కోల్పోయి ఆదుకునే వారు లేక అనేకమంది పురుగులు మందు తాగిఆత్మహత్యలు చేసుకునే దుస్థితిఏర్ప డిందని దుయ్యబట్టారు. ఎన్నికలప్పుడు ఓట్లు కోసం ఇల్లు ఇల్లు తిరిగే అడుక్కునే నాయకులకు రైతు కష్టాలు తెలిసిన గద్దె నెక్కిన తర్వాత ఇచ్చిన మాటను తుంగ లో తొక్కుతున్నారని ఆరోపించారు. పోరాటాల ద్వారా సాధిం చుకున్న కౌలురైతుల చట్టాలను సైతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరచడములో విఫలమయ్యారని దుయ్యబట్టారు. రాను రాను కౌలు రైతులకు ప్రోత్సాహకాలు కరువై వారి నడ్డి విరిచే ప్రయత్నం పాలకులు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్ప టికైనా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కౌలురైతుకు సబ్సిడీ తో ఎరువులు, విత్తనాలు, వడ్డీ లేనిబ్యాంకు రుణాలు, పంటకు గిట్టుబాటుధర అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రత్నమ్మ, శ్రీదేవి, వినోద్, భూదేవి, ఎల్లప్ప,గిరి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19:** శ్రీకాళహస్తి పవన్ కళ్యాణ్ ఆశయంలో భాగంగా శ్రీకాళహస్తిలో ఆర్టీసీబస్టాండ్ సర్కిల్ లో పేట బ్రదర్స్ఆధ్వర్యంలో 49వ వారం డొక్కాసీతమ్మ అన్నదాన కార్యక్ర మమును పవన్ కళ్యాణ్ ఆశయాల కృషి కోసంపనిచేసే జనసేన నాయకులు నిర్వ హించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టే సాయి,పేట బ్రదర్స్ తొట్టంబేడు మండల ఇంచార్జ్ పేట చంద్రశేఖర్,పేట చిరంజీవి, ప్రధానకార్యదర్శి లక్ష్మణ్, మహేష్, ప్రదీప్ కుమార్, మనీ, గరికపాటి చంద్రకాపునాడు నియోజకవర్గ ఇన్చార్జి, జనసేన నాయకులు పగడాల ప్రతాప్ కాపు టౌన్ ప్రెసి డెంట్, అరిగల వేణుగోపాల్ కాపునాడు జిల్లా అధ్యక్షుడు, నాగవరం మాధవ, మురళి జొన్నలగడ్డ, బిజెపి అంపాళం రమణా రెడ్డి, రాజా, నవీన్, మునిచంద్ర, మహిళలు, కవిత, బత్తెమ్మ, శారద, గాయత్రి, పాల్గొన్నారు.

### తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19:**



శ్రీకాళహస్తి లోక్‌సభ ప్రతిపక్ష నేత కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, ప్రియతమ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను రేణి గుంటపట్టణంలో రేణిగుంట మండల అధ్యక్షులు చెరుకు తోట రాహుల్ ఏర్పాటు చేసినటువంటి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసి మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, గుణశేఖర్, ఆసిఫ్, నగేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ కార్యక్రమం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19:** శ్రీకాళహస్తిశాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్వగ్రామంఊరందూరులో దాదాపు రూ. 24,62,489 విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శాసనస భ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆపదలో ఉన్న ప్రతి పేద కుటుంబాలను సీఎం రిలీఫ్ ఫండ్ అంది స్తూ పెద్ద కొడుకుగా ఉన్నారు అని కావున అనారోగ్య కారణాల వల్ల ఆర్థికంగా దెబ్బ తిన్న ప్రతి ఒక్కరు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజే యడం జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జి విజయ్ కుమార్, శ్రీకాళహస్తి రూరల్ అధ్యక్షులు అక్షింతల కృష్ణ యాదవ్, తొట్టంబేడు మండల అధ్యక్షులుముని రాజా నాయుడు, రేణిగుంట రూరల్ పట్టణ అధ్యక్షులు చంద్ర రెడ్డి, భాష, ఏర్పేడు మండల అధ్యక్షులు నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

### తిరుపతి జూ పార్క్ నుండి

## పలమనేరుకు మరో కుంకి ఏనుగు గణేష్



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 19:** పలమనేరు అటవీశాఖఅధికారి ఎఫ్.ఆర్.ఓ. నారాయణ తెలిపిన సమాచారం మేరకు. ముసలిమడుగు ఎలిఫెంట్ హబ్‌కు కర్ణాటకనుండి ఇప్పటికే నాలుగు ఏనుగులను తరలించడం జరిగింది. తదుపరి మరో రెండు ఏనుగులను కుప్పం నుండి తీసుకువచ్చాము. నేడు తిరుపతి నుండి ఓ ఏనుగును తీసుకురావడం జరిగిందన్నారు. ప్రస్తుతం మొత్తం 7 ఏనుగులు ఉన్నాయి వీటన్నింటిని నైపుణ్యత కలిగిన సిబ్బంది చేత పర్యవేక్షణలో ఉంచబడ్డాయి. ఫీల్డ్ లెవల్లో అదుపుతప్పిన ఏనుగులను కంట్రోల్ చేయడానికి త్వరలోనే చర్యలు తీసుకోబోతున్నట్లు తెలిపారు. ప్రస్తుత అటవీశాఖ అధికారి నారాయణ గతంలో తిరుపతిలో పనిచేశారు. అక్కడ ఎలిఫెంట్ హబ్ ఏర్పాటు చేయడంలో ప్రధాన పాత్ర పోషించడం జరిగింది ఆ అనుభవంతోనే పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఇక్కడ కూడా ఎలిఫెంట్ హబ్ ఏర్పాటు చేయడంలో ముఖ్యపాత్ర పోషించినట్లు తెలిపారు.

## యోగా దినోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ

**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19:**



అన్నమయ్యజిల్లా పీలేరు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం గోడ పత్రికను పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగ అనేది జీవనశైలిలో ఒక భాగం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ దివ్య యోగ విద్యాలయం నిర్వాహకులు డాక్టర్ పి వి ఎస్ లక్ష్మి పాల్గొనడం జరిగింది.

## రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం

**పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19:**



అన్నమయ్య జిల్లా పీలేరు లోక్సభ విపక్ష నేత,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని పుర స్కరించుకొని ఎన్.ఎస్.యూ. ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ ఆధ్వర్యంలో పీలేరు ప్రభుత్వ హాస్పిటల్లో అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న రోగులు,వారి బంధువులకు ఉచితంగాభోజనం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మద్దెల అమృత్ తేజ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రజల పక్షాన నిలబడే నేత. ఆయన చూపిస్తున్న మానవతా దృక్పథం, ప్రజల హక్కుల కోసం చేపడుతున్న ఉద్యమాలు ప్రతి ఒక్కరిని ప్రభావితం చేస్తున్నాయి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్. యూ.ఐ జిల్లా అధ్యక్షుడు సాయి సంపత్ కుమార్,నాయకులు అఖిల్,ముని, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్‌కు విశేష స్పందన

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 19:**



చౌడేపల్లి స్థానిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది ఎంఎన్ ఆసుపత్రి చెన్నై వారిచే జరిగిన ఈ శిబిరంలో మొత్తం 35 మంది హాజరుకాగా 12 మంది ఆపరేషన్కు ఎంపికైనట్లు వైద్యాధికారి పవన్ కుమార్ తెలిపారు కంటి పరీక్షలు నిర్వహించి పలువురికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు రహంతుల్లా ఖాన్ ఎంఎన్ ఆసుపత్రి స్థానిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

### గువ్వల రమేష్ రెడ్డి చొరవతో

## పేద కుటుంబానికి నెరవేరిన ఇంటి కల



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 19:** తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి చొరవతో ఇంటి కల నెరవేరింది. మండలంలోని చింతమాకుల పల్లి పంచాయతీ బయపల్లికి చెందిన గంగులప్ప కుటుంబం 2 దశాబ్దాలుగా సొంత ఇంటి కోసం కలవరిస్తోంది. అదే గ్రామానికి ఓ కార్యక్రమ నిమిత్తం వెళ్లిన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డికి గంగులప్ప కుమారుడు ప్రదీప్ కోడలు హేమలు తమకు రెండు దశాబ్దాలుగా ఇల్లు లేదని పూరిగుడిసెలోనే జీవిస్తున్నామని అనడంతో గుండె చెదిరిన గువ్వల రమేష్ రెడ్డి వెంటనే సంబంధిత అధికారితో సంప్రదింపులు జరిపి వారికి పక్కా ఇల్లు మంజూరయ్యేలా చేశాడు. తాము అడిగిన వెంటనే చిరకాల స్వప్నమైన పక్కా ఇల్లు మంజూరు చేయించిన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డికి ఆ నిరుపేద కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. పార్టీలు మారిన పాలకులు మారిన ఇప్పటివరకు ఆ ఇంటికి పక్కా ఇల్లు మంజూరు కాలేదని టిడిపి మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి తర్వాత ఇల్లు మంజూరు, చేసినందుకు గ్రామస్తులందరూ నాయకుడంటే ఇలా ఉండాలి అనుకోవడం వినిపించింది.

## నాయకుడు ఇంట దశదిన కార్యక్రమానికి హాజరైన చల్లా బాబు

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 19:**



తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు సీనియర్ నాయకుడు ఆవుల రామచంద్రయ్య సతీమణి మునిరత్నమ్మ దశదిన కార్యక్రమానికి పుంగనూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డిలు హాజరయ్యారు. దివంగత ముని రత్నమ్మ చిత్రపటానికి పూలమాలవేసి వారి ఇరువురు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతి నాయకుల విగ్రహాల ఏర్పాటుకు సహకరించండి



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 19:** జాతి నాయకుల విగ్రహాల ఏర్పాటుకు సహకరించాలని జిల్లా ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకట్ యాదవ్ తహసిల్దార్ పార్వతిని కోరారు. నూతనంగా వచ్చిన రెవెన్యూ అధికారి పార్వతిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన విగ్రహాలకోసం స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. చౌడేపల్లి మండల కేంద్రం చౌడేపల్లి నందు ప్రధాన కూడలి బస్టాండు నందు మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు మరియు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలు స్థాపించడానికి అదేవిధంగా మండలంలో ఉన్నటువంటి 29 ఏ చింతమకులపల్లి కూడలియందు, కాగతి గ్రామ పంచాయతీ పెద్దూరుకూడలి నందు అలాగే దిగువపల్లి గ్రామపంచాయతీ కొలింపల్లి కూడలియందు మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్ర హాలస్థాపనకొరకు స్థలం కేటాయించవలసింది. రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ నాయకులు సురేష్ మరియు కార్తీక్ పాల్గొనడం జరిగింది.

### వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా

## అమరనాథ్ రెడ్డి



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19** అన్నమయ్యజిల్లా పీలేరు వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పీలేరు మండలం కాకులరం పల్లి పంచాయతీకి చెందిన జి.అమరానాథ్ రెడ్డి నియమితుల య్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన గత 12 సంవత్సరాలుగా పార్టీ బలోపేతానికి కృషిచేసారు. ఈ సందర్భంగా అమరనాథ్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయిలో కీలక పదవి కట్టబెట్టిన మాజీ మంత్రివ పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డికి, యంపీ మిథున్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే చింతల రామ చంద్ర రెడ్డికి, జిల్లా అధ్యక్షులు ఆకెపాటి అమరనాథ్ రెడ్డికి, రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ హరి ప్రసాద్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికలలో వైయస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. గ్రామస్థాయి నుండి ప్రచార విభాగ కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను జనాలలోకి తీసుకెళ్లి, పోరాటాలు చేస్తామని తెలిపారు.

### ముస్లిం నూతన వధూవరులకు

## గృహోపకరణాలు అందజేసిన మాజీ ఎమ్మెల్యే



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19:** శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మైనార్టీ నూతన వధూవరులను ఆశీర్వదించి గృహోపకరణాలు మంచము, పరుపు, బీరువా ను శ్రీకాళహస్తి మాజీ శాసన సభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి , శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, వైయస్సా ర్సీపి మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ ఫరీద్ నూతన వధూవరులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు గోర, గౌస్ బాష, ఫజల్, అస్లా, నియోజకవర్గం వైఎస్ఆర్సిపి యువజన సంఘం అధ్యక్షుడు శ్రీవారి సురేష్, దేవస్థానం మాజీధర్మ కర్తల మండలి సభ్యులు సాధనమున్న రాయల్, మాజీ కౌన్సిలర్ ఉత్తరాదిశరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్, పులిరామ చంద్రయ్య, పెరుమాళ్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## కంచర్ల రామయ్యకు నివాళులర్పించిన కుప్పం టిడిపి నాయకులు

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 19:**



ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ నాన్న శ్రీ కంచర్ల రామయ్య కొద్దిసేపటి క్రితం హైదరాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు వారి ఆత్మకు శాంతి కలగాలని మనస్పూర్తిగా కోరుకుంటూ టీడీపీ కార్యా లయంలో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పి.ఎస్ ముని రత్నం, డాక్టర్ వెంకటేష్, మనియాదవ్, ప్రేమ్ కుమార్, జిమ్ దాము, రాజరామ్, జిమ్ దాము తదితరులు పాల్గొన్నారు.

# జగన్ హయాంలో ఎన్నో అరాచకాలు...

-మొదటిపేజీ తరువాయి

చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. తాము ఎవరినీ టార్గెట్ చేయడం లేదు.. చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. రౌడీయిజం చేసేవారిని, చట్టాన్ని ఉల్లంఘించేవారిని వదిలేయాలా అని నిలదీశారు. ఒక్కసారి ఉన్మాదులుగా మారితే వారిని మార్చగలమా అన్నారు. భవిష్యత్‌ను తీర్చిదిద్దే నాయకుల గురించి ప్రజలు ఆలోచించాలని కోరారు సీఎం చంద్రబాబు.

**ఇప్పుడు రప్ఫా రప్ఫా అంటున్నారు..**

'కొందరికి క్రైమ్ కూడా అలవాటు అయిపోయింది. అంతా యోగా చేస్తే పబ్లిక్ అటెన్షన్ డైవర్ట్ చేయాలని ఇలాంటివి చేస్తున్నారు. ఇప్పుడు రప్ఫా రప్ఫా అంటున్నారు. గంగమ్మ జాతరలో పొట్టేలు నరికినట్లుగా నరికేస్తాం అంటున్నారు. ఒకప్పుడు చెడ్డ లక్షణాలు ఉన్న వ్యక్తిని రాజకీయాల్లో దూరం పెట్టేవారు. ఇప్పుడు వారినే వెనకేసుకుని తిరుగుతున్నారు. మేము ఎప్పుడైనా పోలీసులు వద్దంటే నిబంధనలకు విరుద్ధంగా వెళ్లామా. గంజాయి, బెట్టింగ్ బ్యాచ్, అత్యాచారాలు చేసే వారికి విగ్రహాలు పెడుతున్నారు. ఏపీలో గంజాయి చాలా వరకు కంట్రోల్ చేశాం. గంజాయి, డ్రగ్స్ అరికట్టడానికి ఈగల్ టీం ఏర్పాటు చేశాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**జగన్ హయాంలో ఎన్నో అరాచకాలు...**

'గత జగన్ ప్రభుత్వ హయాంలో ఎన్నో అరాచకాలు జరిగాయి. తాను చేసిందే చట్టం అంటే ఎలా కుదురుతుంది. మీరు మారాలి.. లేకుంటే ప్రజలు మార్చాలి. వైసీపీ నేతలు సమాజానికే పెద్ద సమస్యగా మారిపోయారు. అన్ని నేరాల్లో వాళ్లే ఉంటున్నారు.. మళ్లీ రాజకీయం చేస్తున్నారు.



ప్రశాంతంగా ఉండే కుప్పంలో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. తప్పుడు పనులతో అతలాకుతలం చేస్తామంటే సరికాదు. ఏడాది క్రితం చనిపోయిన వ్యక్తికి ఇప్పుడు పరామర్శా. వైసీపీ హయాంలోనే నాగమల్లేశ్వరరావు చనిపోయాడు. వైసీపీ నేతల వాహనం ఢీకొని చనిపోతే పట్టించుకోరా. రౌడీయిజం చేయాలని అందరినీ ప్రోత్సహిస్తున్నారు' అని సీఎం చంద్రబాబు ప్రశ్నల వర్షం కురిపించారు.

**మేము ఎందుకు భయపడతాం..**

'ఏపీ మొత్తం ఒక మంచి పని చేస్తే వైసీపీ నేతలు మాత్రం నేరాలకు పాల్పడుతున్నారు. నేరస్థుల మెంటాలిటీ అలానే ఉంటుంది. ఇష్టానుసారం వ్యవహరిస్తే చట్టం ఊరుకోదు. విచిత్రమైన మనస్తత్వం ఉన్నవాళ్లు అలా మాట్లాడుతారు. ఆయన చేసిన పనులను చూసి జనం ఆ తీర్పు ఇచ్చారు. జగన్‌కు సత్తెనపల్లి పర్యటన నిమిత్తం 3 కార్లు, 100 మంది జనానికి మాత్రమే ఏపీ పోలీసులు అనుమతి ఇచ్చారు. అంతకంటే ఎక్కువమంది ఎలా వెళ్తారు. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాకు అనుమతులు ఇచ్చారా. 2029లో ఎన్నికలు ఉంటాయి.. ఇప్పుడు నీ వెంట వచ్చిన జనాన్ని చూసి మేము ఎందుకు భయపడతాం. అప్పటికీ నీ ఆటలు ఎలా సాగుతాయనేది చూస్తాం. మీ భవిష్యత్తును తీర్చిదిద్దే నాయకుడి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. రాష్ట్ర నాయకుడిని ఎన్నుకునేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉండాలి. ప్రజలు అడిగితే మేము సమాధానం చెబుతాం. కానీ మా నేతలను వైసీపీ శ్రేణులు నిలదీస్తే తాట తీస్తాను .. ఇందులో సందేహం లేదు. నీ వాహనాలు ఢీ కొట్టి ఒకరు చనిపోతే ఎందుకు పరామర్శించవు. బెట్టింగ్ ప్రాణానికి ఉన్న విలువ నీ వాహనం ఢీకొట్టి చనిపోయిన వారి ప్రాణానికి లేదా. నన్ను, వైజాగ్, తిరుపతిలో ఆపితే నేను దౌర్జన్యం చేశానా. 40 వేల మందిని పొదిలిలో ఎందుకు పోగేశావ్. నువ్వు పొగాకు వేలం కేంద్రానికి 40 వేల మందిని ఎలా తీసుకెళ్తావు. కుప్పంలో జరిగిన సంఘటనకు నేను సిగ్గు పడుతున్నాను. శాంతి భద్రతలు ప్రభుత్వానికి చాలా ముఖ్యం. చంపడం కూడా సినిమాల్లో చూపిస్తారు... వాటిని చూసి నేను బయట చంపుతానంటే ఎలా అని' సీఎం చంద్రబాబు ప్రశ్నించారు.

# దొంగలు ఎక్కడైనా దొంగతనం చేశామని ఒప్పుకొంటారా?

శ్రీకాకుళం: వైవీ సుబ్బారెడ్డి వద్ద ట్యాప్ అయిన తన ఆడియో ఉందని, ఇది నిజమో కాదో.. వైవీ సుబ్బారెడ్డి అతని కుటుంబసభ్యుల మీద ప్రమాణం చేసి నిజం చెప్పాలని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. వైవీ చేతికి ఆ ఆడియో ఎలా వచ్చిందో విచారణకు పిలిచి ప్రశ్నించాలని, ట్యాపింగ్‌లో నిజాలు నిగ్గు తేల్చాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఆమె శ్రీకాకుళంలో మీడియాతో మాట్లాడారు. "కేసీఆర్, జగన్ ఆనాడు నీచ రాజకీయాలు చేశారు. అందులో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ చేశారు. నేను ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదని నాపై నిఘా పెట్టారు. నేను ఎవరిని కలుస్తున్నానో గ్రహించి నాకు మద్దతు ఇవ్వకుండా పెద్ద పెద్ద నాయకులను ఆపేశారు. ఇదంతా ఫోన్ ట్యాపింగ్ చేసి జరిపిన కుట్రనే. సుబ్బారెడ్డి చేతిలో నా ఆడియో ఉంది.



స్వయంగా నేనే విన్నా. ఆస్తుల విషయంలో కుట్రలు పన్ని సుబ్బారెడ్డితో జగన్ అబద్ధాలు చెప్పించారు. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారాయి కాబట్టి ఫోన్ ట్యాపింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో విచారణ జరుగుతోంది. చంద్రబాబుకి అనుకూలంగా మాట్లాల్సిన అవసరం నాకు లేదు. జగన్ తీరు అలీబాబా 40 దొంగల మాదిరిగా ఉంది. ఇంత చేసిన జగన్‌కు ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధం లేదు అంటే ఎలా? దొంగలు ఎక్కడైనా దొంగతనం చేశామని ఒప్పుకొంటారా? ఫోన్ ట్యాపింగ్ కేసులో సుబ్బారెడ్డిని కూడా పిలిచి విచారణ జరపాలి. ఫోన్ ట్యాపింగ్ నా వ్యక్తిగత స్వేచ్ఛను ఉల్లంఘించడమే అవుతుంది. నా ఫోన్ మాత్రమే అని భావించాను.. వందల మంది ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఇప్పుడే తెలుస్తుంది. అందరికీ న్యాయం జరగాలి"అని షర్మిల అన్నారు.

# కలహాల కమలం?

-మొదటిపేజీ తరువాయి

రోజుకొక ప్రజా ప్రతినిధి అందుబాటులో ఉంటున్నారు. ఇక్కడి వరకు అంతా బాగానే ఉంది. కానీ బీజేపీ తల పెట్టిన ఈ కార్యక్రమంపై ఇప్పుడు అనేక విమర్శలు వస్తున్నాయట. గాంధీభవన్ వేదికగా ప్రజలకు అందుబాటులో ఓ మంత్రి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన మంత్రులతో ముఖాముఖి సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతుంది. ప్రజా సమస్యలను తీర్చేందుకు వారంలో ఓ మంత్రి గాంధీభవన్ వేదికగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. వీలైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అంతే కాదు తాజా ప్రజాప్రతినిధులతో పాటు, పార్టీ కీలక ప్రతినిధులు సైతం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రేవంత్ సర్కార్ ప్లాన్ చేస్తోంది. మరోవైపు పూలే భవన్ వేదికగా వారంలో రెండు రోజులు అంటే.. మంగళవారం, శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై ఫోకస్ చేస్తున్నారు. ఇప్పుడు బీజేపీపై వస్తున్న విమర్శలు ఏంటంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ చేస్తున్న కార్యక్రమాన్ని.. బీజేపీ కాపీ చేస్తోందని విమర్శిస్తున్నారు ఆ పార్టీ నేతలు. బీజేపీ భరోసాకు ప్రజలే కరువయ్యారనే చర్చ. అంతేకాదు బీజేపీ భరోసాకు ప్రజలే కరువయ్యారనే చర్చ మొదలైందట. ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రజలు బీజేపీ పార్టీ ఆఫీస్ మెట్లు ఎక్కడం లేదనే టాక్ వినిపిస్తోంది. రోజుకొక ప్రతినిధి పార్టీ కార్యాలయానికి చేస్తూ వెళ్తున్నారు. ఎన్ని ఫిర్యాదులు వచ్చాయో చెప్పలేని పరిస్థితుల్లో నాయకత్వం ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయట. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి రైతులు, కార్మికులు, వివిధ వర్గాల నుంచి వేలాదిగా ఫిర్యాదులు వస్తున్నాయి అంటూ బుకాయింపులు తప్పితే బీజేపీ చేపట్టిన భరోసాలో ప్రజలు, ప్రజా సమస్యలపై ఫిర్యాదులు లేవనే కామెంట్లు ఇటు పొలిటికల్ సర్కిల్లో.. అటు కాంగ్రెస్ సర్కిల్లో వినిపిస్తున్నాయట. రియల్ ఎస్టేట్ దందాలకు సంబంధించిన సెటిల్‌మెంట్ అంశాలే ఎక్కువనే చర్చ. బీజేపీ భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించింది రెండు వారాలు గడుస్తోంది. ఇందులో ప్రజా సమస్యలు కాకుండా రియల్ ఎస్టేట్ దందాలకు సంబంధించిన సెటిల్ మెంట్ అంశాలే ఎక్కువగా వస్తున్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతేకాదు గత బీఆర్ఎస్ పార్టీ చేసిన ఆగడాలు మినహాయిస్తే? ప్రజా పాలనపై బీజేపీ తలపెట్టిన భరోసా కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు ఇప్పటి వరకు రాకపోవడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారిందట. కాంగ్రెస్ పాలనపై పొద్దున లేస్తే దుమ్మెత్తి పోయడమే పనిగా పెట్టుకున్న బీజేపీ నేతలకు ప్రజా పాలనపై క్లారిటీ వచ్చిందనే విమర్శలు కాంగ్రెస్ నుంచి వినిపిస్తున్నాయి. ముగియనున్న జీహెచ్ఎంసీ కౌన్సిల్ గడువు. త్వరలోనే స్థానిక సంస్థల



ఎన్నికలు రాబోతున్నాయి. అంతేకాదు 9 నెలల్లో జీహెచ్ఎంసీ కౌన్సిల్ గడువు కూడా ముగియనుండటంతో బీజేపీ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ సంస్థాగత బలం పెంచుకోవడానికి వ్యూహాలు పన్నుతోంది. పార్టీ కార్పొరేటర్లు ఉన్న డివిజన్లలో వారిని, కార్పొరేటర్లు లేని చోట డివిజన్ స్థాయి నాయకులు కాస్త ముందు నుంచే ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ ఆదేశించినట్లు కాషాయ శ్రేణులు చెబుతున్నాయి. అందుకే కొత్త కొత్త కార్యక్రమాలతో ప్రజల్లో ఉండాలని చూస్తోంది. 2020లో జరిగిన గ్రేటర్ ఎన్నికల్లో 40కి పైగా సీట్లు సాధించిన బీజేపీ, మజ్లిస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే హైదరాబాద్ ప్రజలను అకట్టుకునేందుకు జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేసి, హైదరాబాద్‌లో ఎంఐఎంను టార్గెట్ చేస్తూ హిందుత్వ ఎజెండాను సమర్థంగా వినిపించిందని, భవిష్యత్తులో తమకు కావలసిన మైలేజీని పెంచుకుందంటున్నారు. నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలే మైనస్. తెలంగాణలో సంస్థాగతంగాపార్టీ బలోపేతమే లక్ష్యంగా కాషాయ పార్టీ అడుగులు వేస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల జోష్‌ను కంటిన్యూ చేయాలనే ఆలోచనలో అధిష్టాన పెద్దలు ప్రణాళికలకు పదును పెడుతున్నారంట. కానీ రాష్ట్ర నేతల వ్యవహారం మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తుండటంతో అధిష్టానం తలలు పట్టుకుంటుందంటున్నారు.పార్టీలో ఉన్న నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలు పార్టీ ఎదుగుదలకు మైనస్ అవుతున్నాయనే టాక్ వినిపిస్తోంది. వీటన్నింటిని కవర్ చేస్తూ కొత్త కొత్త కార్యక్రమాలను డిజైన్ చేస్తోంది కమలం పార్టీ. 11 ఏళ్ల పాలనపై ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ భావిస్తోంది. వరుసగా మూడుసార్లు అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ కొట్టడంతో పాటు ఈ 11 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధికి కేటాయించిన నిధులు వంటి వివరాలను ప్రజలకు వివరించేందుకు కాషాయ దళం సిద్ధమవుతోంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, పథకాలపై చర్చలు. వికసిత్ భారత్ లక్ష్యానికి 11 ఏండ్లు అంటూ ప్రజల్లో మమేకం అయ్యేందుకు కసరత్తులు చేస్తున్నారు ఆ పార్టీ నేతలు. మరోవైపు తెలంగాణలో 8 ఎంపీ, 8 ఎమ్మెల్యేలు, 3 ఎమ్మెల్సీ లను కైవసం చేసుకున్న కాషాయా పార్టీ పూర్తి స్థాయిలో రాబోయే సమరానికి గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటుంది. గెలిచిన వారంతా కూడా తమ తమ అసెంబ్లీ, పార్లమెంట్ సెగ్మెంట్ లకు తీసుకొచ్చిన నిధుల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై దృష్టిసారిస్తున్నారు. అందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలతో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నా నిధులు, సంక్షేమ పథకాలపై మరిన్ని కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకెళ్లి పార్టీకి మైలేజ్ వచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ప్రతి గ్రామానికి ఏమిచ్చాం? ఎంత మేరకు నిధులు కేటాయించామనే వివరాలు వారికి వివరించేలా బీజేపీ ప్రణాళికలు చేపడుతోందనీ పార్టీ వర్గాలు చెప్పుకొస్తున్నాయి. మొత్తానికి ఇటు తెలంగాణలో బీజేపీ భరోసా, అటు 11 ఏళ్ల మోడీ పాలనా భరోసా రాష్ట్ర బీజేపీకి ఏ విధంగా సహకరిస్తాయి అనేది చూడాలి.

## సాగు యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా

-మొదటిపేజీ తరువాయి

రూ.6,404 కోట్లు విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు రైతు భరోసా సాయం అందిస్తామని చెప్పారు.

## నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డికి బాధ్యతలేదు..

-మొదటిపేజీ తరువాయి

విషయంలో రేవంత్‌రెడ్డిది బాధ్యతారాహిత్యమేనని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి లెక్క తాము అడ్డదారిలో రాలేదు.. ఉద్యమం నుంచి వచ్చిన వాళ్లమని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి ఏపీ బనకచర్ల ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆరోపించారు. అఖిలపక్షా ఎంపీల సమావేశం పెట్టింది బనకచర్లను ఆపటానికా, కట్టుకోమని చెప్పటానికా అని ప్రశ్నించారు. గురువారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీష్‌రావు మీడియాతో చిట్‌చాట్ చేశారు. గోదావరిలో 1000, కృష్ణాలో 500 టీఎంసీలు ఇచ్చి మిగిలిన నీటిని ఆంధ్రప్రదేశ్ తీసుకెళ్లమని చెప్పటానికి రేవంత్‌రెడ్డి ఎవరని మాజీ మంత్రి హరీష్‌రావు నిలదీశారు. గోదావరి, కృష్ణా నీళ్లను ఏపీ వాడుకోమని ఎలా చెబుతారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కి దాసోహం అయ్యారని విమర్శించారు. నల్లమల ఏ జిల్లాల్లో ఉందో కూడా రేవంత్‌రెడ్డికి తెలియదని ఎద్దేవా చేశారు. గోదావరి, కృష్ణా బేసిన్‌ల మీద బేసిక్ నాలెడ్జ్ కూడా రేవంత్‌రెడ్డికి లేదని విమర్శించారు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలంగాణ పరువు తీశారని ధ్వజమెత్తారు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో స్కూల్ పిల్లాడిని అడిగినా చెబుతాడని.. ఈ మాత్రం కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. బనకచర్ల ఏ బేసిన్‌లో ఉందని రేవంత్‌రెడ్డి అధికారులను అడగటం సిగ్గుచేటని అన్నారు. రేవంత్‌రెడ్డి తేలికగా అబద్ధాలు ఆడుతున్నారని ఫైర్ అయ్యారు మాజీ మంత్రి హరీష్‌రావు. ఉద్యమం చేయలేదు కాబట్టే.. రేవంత్‌రెడ్డికి నీటి విలువ తెలియదని మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. పోతిరెడ్డిపాడుకు వ్యతిరేకంగా ఆరుమంత్రి పదవులకు రాజీనామా చేసిన చరిత్ర తమదని ఉద్ఘాటించారు. జగన్‌తో కేసీఆర్ మాట్లాడిన మాటలను రేవంత్‌రెడ్డి వక్రీకరించారని మండిపడ్డారు. నదీ మార్గం నుంచే నీళ్లు తేవాలని జగన్‌తో కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. రెండు తెలుగు రాష్ట్రాలకు మేలు జరిగేలా మాట్లాడుకోవాలని మాత్రమే గతంలో కేసీఆర్ అన్నారని తెలిపారు. ఇరు రాష్ట్రాలకు ఉపయోగపడేలా ప్రణాళికలను రచించుకోవాలని మాత్రమే జగన్‌తో కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. సముద్రంలో కలుస్తున్న 3వేల టీఎంసీల్లో తెలంగాణకు 1950 టీఎంసీలు కావాలని కేసీఆర్ డిమాండ్ చేశారని అన్నారు. సముద్రంలో కలిసే నీటిని ఆంధ్రప్రదేశ్ తీసుకోవాలని కేసీఆర్ ఎక్కడ చెప్పలేదని తేల్చిచెప్పారు మాజీ మంత్రి హరీష్‌రావు. తెలంగాణ అంగీకారం లేకుండా నీటిని తీసుకెళ్తామంటే తాము ఒప్పుకోమని కేసీఆర్ స్పష్టం చేశారని మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు. వైఎస్ పెట్టిన జలయజ్ఞాన్ని ధనయజ్ఞం అని రేవంత్‌రెడ్డి గతంలో అనలేదా అని ప్రశ్నించారు. 19నెలల్లో ఒక్క ప్రాజెక్ట్ కూడా రేవంత్‌రెడ్డి ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయని ఆరోపించారు. రెండు జాతీయ పార్టీలు బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెడుతున్నాయని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వైఫల్యంతోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కుప్పకూలిందని ఆక్షేపించారు. తెలంగాణ హక్కుల కోసం చిత్తశుద్ధితో పోరాడితే రేవంత్ ప్రభుత్వానికి సహకరిస్తామని..లేకపోతే రైతుల పక్షాన సుప్రీంకోర్టుకు వెళ్తామని హరీష్‌రావు స్పష్టం చేశారు.

## రాహుల్ ఒత్తిడితోనే కేంద్రం కులగణనకు అంగీకరించింది



**హైదరాబాద్:** రాబోయే తరానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిక్సూచి అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆయన ఒత్తిడి మేరకే కేంద్ర ప్రభుత్వం కులగణనకు అంగీకరించి గెజిట్ విడుదల చేసిందని చెప్పారు. రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా గాంధీభవన్‌లో వేడుకలు నిర్వహించారు. మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ అనిల్‌కుమార్‌తో కలిసి పొన్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఆలోచన మేరకే కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు కులగణన చేసిందని పొన్నం అన్నారు. అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ దేశ ప్రజల కోసం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీలో మాత్రమే బడుగు, బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. బలహీనవర్గాలకు చెందిన మంత్రిగా పొన్నం, పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్, దళిత మంత్రిగా తాను నిదర్శనమన్నారు. సామాజిక న్యాయంలో భాగంగా సామాన్య కార్యకర్త నుంచి మంత్రినయ్యానని చెప్పారు. మంత్రిగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలకు హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు.

## నటి రమ్యశ్రీపై దాడి

**హైదరాబాద్ :** టాలీవుడ్ నటి రమ్యశ్రీ, ఆమె సోదరుడిపై హైదరాబాదులో దాడి జరిగింది. సంధ్యా కన్వెన్షన్ పక్కన ఉన్న ఎఫ్సీఐ కాలనీ లేఔట్ కు సంబంధించి హైడ్రా మార్కింగ్ చేయడం వావాదానికి దారితీసింది. హైడ్రా అ ధికారులు మార్కింగ్ చేస్తుండగా వీడియో తీసిన రమ్యశ్రీ, ఆమె సోదరుడు ప్రశాంతపై దాడి జరిగింది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారిని అనుకుని ఉన్న ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఔట్ లో సంధ్య కన్వెన్షన్ ఆక్రమణలను హైడ్రా అధికారులు నెల రోజుల కిందట తొలగించారు. పర్మిషన్ లేకుండా నిర్మించిన ఒక మినీ హాల్ రెండు షెడ్లు, కొన్ని గదులను హైడ్రా కూల్చివేసింది. అయితే సంధ్య కన్వెన్షన్ ఓనర్ శ్రీధర్ రావు ఎఫ్ సి ఐ లేఔట్ లో రోడ్లు పార్కుల ఆనవాళ్లు లేకుండా చేశారని ప్లాట్ యజమానులు హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు.ప్లాట్ యజమానుల వినతి మేరకు శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ అధికారులు, హైడ్రా అధికారులు మంగళవారం నాడు ఎఫ్‌సీఐ లేఔట్లలో రహదారుల గుర్తింపు పనులు చేపట్టారు. లైన్లు మార్కింగ్ చేస్తుండగా లేఔట్‌లో ఓ ప్లాట్ యజమాని అయిన రమ్యశ్రీ, ఆమె సోదరుడు ప్రశాంత్‌తో కలిసి తమ ఫోన్లో వీడియో తీశారు. అనంతరం మధ్యాహ్నం లంచ్‌కు వెళ్తున్న సమయంలో రమ్యశ్రీ, ఆమె సోదరుడ్ని కొందరు అడ్డుకున్నారు. వీడియోలు ఎందుకు తీశారంటూ వారి వద్ద ఉన్న ఫోన్ లాక్కునేందుకు చూడగా, అడ్డుకున్న ప్రశాంత్‌ను నిందితులు కొట్టారు. ఏ తప్పు లేకున్నా తమపై దాడి చేసిన సంధ్య కన్వెన్షన్ యజమాని శ్రీధర్‌రావు అనుచరులపై చర్యలు తీసుకోవాలి గచ్చిబౌలి పోలీసులకు నటి రమ్యశ్రీ ఫిర్యాదు చేశారు. వీరి మధ్య గొడవపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. పోలీసులు బందోబస్తు నడుమ అధికారులు లేఔట్ రోడ్ల మార్కింగ్ చేశారని, అధికారుల సమక్షంలో గొడవ జరగలేదని తెలిపారు.

# రైతులు భయపడొద్దు... మోసపోవద్దు

## ఈనాడు సీనియర్ జర్నలిస్ట్ కంచర్ల రామయ్యకి స్వర్గలోక ప్రాప్తిరస్తు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్19:** కుప్పం తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ చైర్మన్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా కంచర్ల శ్రీకాంత్‌కి పితృ వియోగం కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రామయ్య కొద్దిసేపటి క్రితం తుదిశ్వాస విడిచారు. కొద్దిగా కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం స్వర్గస్తులైనారు. ప్రకాశం జిల్లా ఈనాడు విలేఖరిగా వృత్తిజీవితాన్నిప్రారంభించిన రామయ్య తర్వాతి కాలంలో హైదరాబాదలో ఈనాడు సెక్రెటేరియట్ వార్తలు కవర్ చేసేవారు. స్వర్గీయ ఎన్టీఆర్ ప్రోత్సాహంతో ఈనాడులో ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ప్రకాశం జిల్లా కందుకూరు అసెంబ్లీ నియో జకవర్గం నుండి తెదేపా అభ్యర్థిగా పోటీ చేసే అవకా శాన్ని తృటిలో కోల్పోయారు. కందుకూరులో ప్రకాశంఇంజనీరింగ్ కాలేజ్‌ని స్థాపించి వేలాది మంది గ్రామీణ విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందించారు. కందుకూరులో జరిగే సామా జిక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా నిలిచేవారు. రామయ్యకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.రామయ్య అంత్యక్రియలు శనివారం ఉదయం10 గంలకు కందుకూరులో జరుగుతాయి.

## యోగాంధ్రను విజయవంతం చేద్దాం:ఎంపీడీఓ ప్రసాద్



**వరదయ్యపాలెం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 19:** ప్రతిఒక్కరూ యోగానితమ జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని ఎంపీడీఓ ప్రసాద్ పిలుపునిచ్చారు. జూన్ 21న జరగబోయే అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా, యోగాంధ్ర ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. వైద్యపరంగా, మానసికంగా మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు యోగా కీలక పాత్ర పోషిస్తుందని ఎంపీడీ ఓ ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు,మహిళలు, ఉద్యోగులు, రైతులు ప్రతి వర్గం వారూ యోగా చేయడం ద్వారా మేలును పొందవచ్చని వివరించారు.సర్వత్రా యోగా పై అవగాహన పెంచేలా కార్యక్రమాలు, శిబిరాలు నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను కోరారు. గ్రామీణ స్థాయిలో స్వచ్ఛంద సేవకులు, సచివాలయ సిబ్బంది. ఈ కార్యక్ర మంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, యోగా గురువులు పాల్గొన్నారు."మన ఆరోగ్య భద్రతకు యోగా మార్గదర్శకం అవుతుంది, అందరం కలిసి యోగాంధ్రను విజయవంతం చేద్దాం" అంటూ ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## ఆధార్ అప్‌డేట్‌తో సచివాలయంలో సందడి.



**వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19:** వరదయ్యపాలెం మేజర్ పంచాయతీ సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఆధార్ కార్డ్‌లో మార్పులు చేయించుకోవాలన్న ఆవసరతతో పౌరులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. ప్రతి గురువారం ఉదయం నుంచే సచివాలయం వద్దకు చేరు కుంటున్న ప్రజలు, తమ ఆధార్ డేటాలో ఫోటో, చిరునామా, మొబైల్ నంబర్ తదితర వివరాలు సవరించుకుంటున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు, సచివాలయ సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతున్నారు. సిబ్బంది కూడా శ్రద్ధగా పనిచేస్తూ, క్యూలైన్‌లో నిలబడ్డవారికి సౌకర్యాలు కల్పిస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువైనదిగా, ఉపయోగపడుతున్నదిగా ఈ కార్యక్రమం చాటి చెబుతోంది.





### రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం
### మనది రైతు ప్రభుత్వం
### అందరి అభిమానంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడింది
### గత ప్రభుత్వంలో రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశారు... ఆర్థిక వ్యవస్థ కుంటుబడింది
### కొద్దిరోజుల్లో అన్నదాత సుఖీభవ నగదును జమ చేస్తాం

**బాపట్ల, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 19:** నల్ల బర్లీ పొగాకు చివరి ఆకు వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి కింజారపు అచ్చంనాయుడు పొగాకు రైతులకు భరోసా ఇచ్చారు. పర్చూరు మండలం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన నల్ల బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు గురువారం ప్రారంభించారు. ముందుగా పర్చూరు ప్రధాన కూడలి నుంచి మార్కెట్ యార్డ్ వరకు రైతులు నిర్వహించిన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. పుష్పాలతో ఆయనకు ఘనంగా ఆహ్వానం పలికారు. మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం గోదామును ఆయన పరిశీలించారు. హెచ్ డి ఆర్, హెచ్ డి ఎం రకం బ్లాక్ బర్లీ పొగాకు ఒక క్వింటా ధర రూ. 12వేలు, హెచ్ డి ఎక్స్ రకం పొగాకు ఒక క్వింటా రూ.ఆరు వేలు ధరతో మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి ప్రకటించారు.

నల్ల బర్లీ పొగాకును రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా కొనుగోలు చేస్తుందని మంత్రి అచ్చంనాయుడు తెలిపారు. రైతులు రాజుగా ఉండాలి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడించేలా అన్ని వనరులను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తోందన్నారు. రైతుల కష్టాలన్నీ తీరుస్తున్నాం, రహదారులు, నీటి ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ రంగానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నారని వివరించారు. 90% రాయితీపై స్ప్రింక్లర్లు, బిందు సేద్యానికి సంబంధించిన యంత్రాలను పంపిణీ చేశామన్నారు. గత ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.1,650 కోట్లను చెల్లించామన్నారు. గడిచిన ఖరీఫ్, రబీ సీజన్లో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేసిందన్నారు. రైతులకు 24 గంటల్లోనే డబ్బులు చెల్లించిన ఘనత ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిర్చి, మామిడి, కోకో, బ్లాక్ బర్లీ పొగాకు పంటలకు తీవ్ర సమస్య వచ్చిందన్నారు. మిర్చి ధర తగ్గకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రణాళిక బద్ధంగా మద్దతు ధరతో కొనుగోలు చేశారన్నారు. మామిడి పంటకు మద్దతు ధరను ప్రభుత్వం కల్పించిందన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు పంటను సాగు చేయాలని రైతులపై ఒత్తిడి తెచ్చిన కంపెనీలు ఇప్పుడు దిగుబడి రాగానే చేతులెత్తేశాయని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ముందుకు వచ్చి రైతులకు అండగా నిలిచిందన్నారు. చరిత్రలో ఎక్కడా, ఎప్పుడు లేనట్లుగా ప్రభుత్వమే మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలులు ప్రారంభించిందన్నారు. కొనుగోలు చేసిన పొగాకును విదేశాలకు ఎగుమతి చేయాలంటే నాణ్యతను, మార్క్ ఫెడ్ నిబంధనలను రైతులు తప్పనిసరిగా పాటించాలన్నారు. పొగాకు రైతులకు సుమారుగా రూ.500 కోట్లు నగదు రానున్నదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్చూరు, చీరాల, బికే పాలెం , గుంటూరు ,ఎడ్లపాడు, గుడ్లవల్లి, పెదకాకాని ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు.

పొగాకు రైతులు ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని మంత్రి అచ్చంనాయుడు స్పష్టం చేశారు. ఇలాంటి దుర్భిక్ష పరిస్థితులకు రైతులు గురిగాకుండా ప్రభుత్వం నూతన విధానాలతో ముందుకు వెళ్తుందన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు, భూమి, వాతావరణ సమతుల్యతను బట్టి ఎలాంటి పంటలు సాగు చేయాలో ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని, అధికారుల సూచన మేరకు రైతులు పంటల సాగు చేయాలన్నారు. ప్రభుత్వ సూచనలు పాటిస్తే భవిష్యత్తులో ఇలాంటి సమస్యలను అధిగమించవచ్చన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తుందన్నారు.

రైతుల కళ్ళల్లో కన్నీరు చూడరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి రాజశేఖర్ తెలిపారు. రైతులకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మార్క్ ఫెడ్ ఎండి మంజీర్ జిలాని సమాన్ చెప్పారు. రైతులు అప్పుల ఊబిలో చిక్కుకోకుండా ఆదుకోవటానికే ప్రభుత్వం ముందుకు వచ్చి బ్లాక్ బర్లీ పొగాకును కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు.


రైతుల పరిరక్షణ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. చివరి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పుడు కొనుగోలు సాధ్యం కాదని రైతులు అపోహ పడ్డారని, అసాధ్యాన్ని హస్త ప్రభుత్వం సుసాధ్యం చేసిందన్నారు. విదేశీ మరకద్రవ్యం అధికంగా వచ్చే బ్లాక్ బర్లీ పొగాకు పంటను ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. పొగాకు పంట అత్యధికంగా పర్చూరు నియోజకవర్గంలోని రైతులు సాగు చేశారని, వారికి ప్రభుత్వం కొండంత అండగా నిలిచిందన్నారు. తదుపరి ఏ పంట వేసుకోవాలో ప్రభుత్వం నిర్ణయం మేరకు పంటలు సాగు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రణాళికతో ముందుకు సాగాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, వేర్ హౌసింగ్ డైరెక్టర్ సురేష్ కుమార్, లేట్ క్యాప్ చైర్మన్ ఎరిక్షన్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, మార్క్ ఫెడ్ ఏడి కరుణశ్రీ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమేష్ బాబు, జిల్లా సహకార శాఖ అధికారి శ్యాంసన్, బుడ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, జిల్లా అధికారులు తదితర శాఖల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

---

## స్పోర్ట్స్

# భారత్‌కు తొలి పరీక్ష..!
# రేపటి నుంచి ఇంగ్లండ్‌తో టెస్ట్

టీమిండియా-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగే ఐదు టెస్టుల సిరీస్ ప్రారంభం కానున్నది. జూన్ 20న లీడ్స్‌లోని హెడింగ్లీ మైదానంలో శుక్రవారం నుంచి తొలి టెస్ట్ మొదలవనున్నది. ఇప్పటికే భారత జట్టు లీడ్స్ చేరగా.. ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు హెడింగ్లీలోనే శిబిరం ఏర్పాటు చేసుకున్నది. ఈ నేపథ్యంలో హెడింగ్లీ పిచ్ స్వభావం ఎలా ఉంటుందనే దానిపై చర్చ మొదలైంది. లీడ్స్ గ్రౌండ్ హెడ్ రిచర్డ్ రాబిన్సన్ వివరాలు వెల్లడించారు. 'ప్రస్తుతం వాతావరణం పొడిగా ఉంది. ఫలితంగా మంచి బ్యాటింగ్ పిచ్ తయారైంది. తొలి రోజు పేసర్లకు సహకరిస్తే, ఆపై పిచ్ నెమ్మదిగా మారే అవకాశం ఉంది' అని వెల్లడించారు. ఇంగ్లాండ్ జట్టు అనుసరిస్తున్న 'బజ్‌బాల్' ఆటశైలికి అనుకూలంగా ఉంటుందన్నారు. అయితే, ఈ పిచ్ యువ భారత బ్యాటింగ్ లైనప్‌కు పరీక్షగా మారవచ్చని రాబిన్సన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో ఈ మైదానంలో భారత్ ఎక్కువగా మ్యాచ్‌లు ఆడకపోవడం, ఈసారి టెస్ట్ సిరీస్ తొలి మ్యాచ్ ఇక్కడే జరగడం విశేషం. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన నేపథ్యంలో.. యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ టీమిండియా టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఈ మ్యాచ్‌లో జడేజా, కేఎల్ రాహుల్ వంటి సీనియర్లు కీలక పాత్ర పోషించనున్నారు. యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్‌లకు కీలక అవకాశంగా మారనుంది. ఇదిలా ఉంగా.. తొలి టెస్టు



ఇప్పటికే ఇంగ్లండ్ జట్టును ప్రకటించింది. బెన్ స్టోక్స్ సారథ్యంలోని ఇంగ్లండ్ ఐదుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు, ఇద్దరు పేస్ ఆల్‌రౌండర్లు, ఒకే ఒక స్పిన్నర్, ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగనుంది. జాక్ క్రాలె, బెన్ డకెట్, ఒలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జెమీ స్మిత్, క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్, జోష్ టంగ్, షోయబ్ బషీర్‌కు జట్టులో చోటు కల్పించింది. మరో వైపు భారత జట్టు కూర్పుపై కసరత్తు చేస్తున్నది.

## ధోని వరల్డ్ రికార్డుపై కన్నేసిన పంత్

టీమిండియా యువ ఆటగాడు రిషభ్ పంత్ భారత దిగ్గజ కెప్టెన్, లెజెండరీ వికెట్ కీపర్ బ్యాటర్ మహేంద్ర సింగ్ ధోని ప్రపంచ రికార్డుపై కన్నేశాడు. ఇంగ్లండ్ గడ్డ మీద సరికొత్త చరిత్ర సృష్టించేందుకు 267 పరుగుల దూరంలో నిలిచాడు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025-27లో భాగంగా భారత్- ఇంగ్లండ్ శుక్రవారం నుంచి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడనున్నాయి. ఈ సిరీస్‌తో టీమిండియా సారథిగా శుబ్‌మన్ గిల్ ప్రస్థానం మొదలుకానుండగా.. వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. కాగా 2018లో టీమిండియా తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేసిన పంత్.. ఇంగ్లండ్‌తో తన తొలి మ్యాచ్ ఆడాడు. ట్రెంట్ బ్రిడ్జి వేదికగా నాడు ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టెస్టులో పంత్ రెండు ఇన్నింగ్స్‌లో వరుసగా 24, 1 పరుగు చేశాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా 203 పరుగుల భారీ తేడాతో గెలిచింది. అరంగేట్రంలో అంతంత మాత్రంగానే ఆడిన పంత్.. ఇంగ్లండ్ మీద ఆ తర్వాత మెరుగైన ప్రదర్శన ఇచ్చాడు. ఇప్పటి వరకు మొత్తంగా అక్కడ





ఎనిమిది టెస్టు మ్యాచ్‌లు ఆడిన పంత్ 511 పరుగులు చేశాడు. ఇందులో రెండు శతకాలు కూడా ఉన్నాయి. ఇక ఇంగ్లండ్‌లో అత్యధిక పరుగులు చేసిన పర్యాటక జట్ల వికెట్ కీపర్ల జాబితాలో 27 ఏళ్ల పంత్ ప్రస్తుతం తొమ్మిదో స్థానంలో ఉన్నాడు. ఈ లిస్టులో టీమిండియా లెజెండ్ ధోని అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్‌లో ధోని మొత్తంగా 778 పరుగులు సాధించాడు. అతడిని అధిగమించాలంటే.. పంత్ ఇంకో 267 పరుగులు చేయాలి. తాజా పర్యటనలో భాగంగా టీమిండియా ఐదు టెస్టులు ఆడనున్న నేపథ్యంలో.. పంత్ గనుక బ్యాట్ ఝులిపిస్తే ఇదేమీ అంతకష్టం కాబోదు. మరి.. ఈ ఉత్తరాఖండ్ బ్యాటర్ ఈసారి ధోని వరల్డ్ రికార్డును బ్రేక్ చేస్తాడేమో చూడాలి!! కాగా రిషభ్ పంత్ టీమిండియా తరఫున ఇప్పటి వరకు 43 టెస్టు మ్యాచ్‌లు ఆడి 2948 పరుగులు చేశాడు. ఇందులో ఆరు శతకాలు, 15 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## గిల్ కచ్చితంగా ట్రోఫీతోనే తిరిగి వస్తాడు: టీమిండియా దిగ్గజం



భారత టెస్టు క్రికెట్‌లో కొత్త శకం ఆరంభం కానుంది. దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లి, లెజెండరీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, కెప్టెన్ రోహిత్ శర్మ వంటి దిగ్గజాల నిష్క్రమణ తర్వాత.. యువ ఆటగాడు శుబ్‌మన్ గిల్ సారథ్యంలో భారత జట్టు ఇంగ్లండ్ గడ్డ మీద తొలి టెస్టు సిరీస్ ఆడబోతోంది. లీడ్స్‌లో శుక్రవారం నుంచి ఇరుజట్ల మధ్య పోటీ ఆరంభం కానుంది. అయితే, ఇంగ్లండ్‌లో టెస్టు సిరీస్ గెలవడం అంత సులువేమీ కాదు. ఇప్పటి వరకు టీమిండియా కేవలం మూడుసార్లు మాత్రమే అక్కడ విజయపతాక ఎగురవేసింది. 1971లో అజిత్ వాడేకర్ సారథ్యంలో.. 1986లో కపిల్ దేవ్ కెప్టెన్సీలో.. చివరగా 2007లో రాహుల్ ద్రవిడ్ నాయకత్వంలో ఇంగ్లండ్‌ను తమ స్వదేశంలో భారత్ ఓడించగలిగింది. ఈ నేపథ్యంలో.. కఠిన సవాలుకు సిద్ధమైన గిల్ సేన.. సొంతగడ్డపై మరింత పటిష్టంగా కనిపించే స్టోక్స్ బృందాన్ని ఏ మేరకు కట్టడి చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో టీమిండియా దిగ్గజం కపిల్ దేవ్ భారత జట్టు కొత్త సారథి శుబ్‌మన్ గిల్‌ను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గిల్ తప్పక ట్రోఫీతో తిరిగి వస్తాడని ధీమా వ్యక్తం చేశాడు. ఈ మేరకు.. "అతడు ప్రతిభావంతుడైన ఆటగాడు. ఇప్పుడు భారత జట్టుకు కెప్టెన్ అయ్యాడు. కచ్చితంగా ట్రోఫీతోనే అతడు ఇంగ్లండ్ నుంచి తిరిగి వస్తాడు. మనల్ని గర్వపడేలా చేస్తాడు. టీమిండియాకు గుడ్‌లక్. మనోళ్లు విజేతలుగా తిరిగి వస్తారు. వారికి ఆ సత్తా ఉంది" అని కపిల్ దేవ్ టైమ్స్ ఆఫ్ ఇండియాతో వ్యాఖ్యానించాడు.

### విచిత్రంగా అనిపించింది..

టీమిండియా- ఇంగ్లండ్ మధ్య టెస్టు సిరీస్‌ను పటౌడీ ట్రోఫీగా పిలిచేవారు. అయితే, తాజాగా దీనికి ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు టెండుల్కర్-ఆండర్సన్ ట్రోఫీగా నామకరణం చేసింది. ఈ విషయంపై స్పందించిన కపిల్ దేవ్.. "నాకైతే ఇది విచిత్రంగా అనిపించింది. ఇలా కూడా జరుగుతుందా అని ఆశ్చర్యం వేసింది. మరేం పర్లేదు. క్రికెట్‌లో అన్నీ జరుగుతాయి. క్రికెట్ అంటే క్రికెటే. మైదానంలో ఆటగాళ్ల స్ఫూర్తి అలాగే ఉంటుంది" అని పేర్కొన్నాడు. కాగా పటౌడీ పేరును తొలగించడంపై ఈసీబీపై విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ, టీమిండియా లెజెండరీ బ్యాటర్ సచిన్ టెండుల్కర్ విజ్ఞప్తి నేపథ్యంలో.. భారత్- ఇంగ్లండ్ టెస్టు సిరీస్ గెలిచిన కెప్టెన్‌కు పటౌడీ పేరిట పతకం అందించాలని ఈసీబీ నిర్ణయించింది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143